సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం, 8, మార్చి, 2023



ఇల వైకుంఠం.. బిలకూటక్షేత్రం

కొండబిట్రగుంటలోని బిలకూటక్షేత్రంలో ప్రసన్నుని కల్యాణోత్సవం మంగళవారం కనులపండువగా జరిగింది. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.57,720
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,155
3 శాతం జీఎస్టీతో	రూ.5,310
నవర (8 గ్రా)	రూ.42,480

గరిష్టం/కనిష్టం
32.9 /23.5

వాతావరణం

మంగళవారం గాలిలో 53 శాతం తేమ ఉంది. జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. బుధవారం వాతావరణంలో ఎలాంటి మార్పు ఉండదు.

న్యూస్‌రీల్

నేడు మాజీ ఉపరాష్ట్రపతి రాక



వెంకటాచలం: మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు బుధవారం వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌కు రానున్నారు. చెన్నై నుంచి ఉదయం 10.10 గంటలకు నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి 12.13 గంటలకు గూడూరు రైల్వేస్టేషన్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డుమార్గాన బయలుదేరి 12.45 గంటలకు స్వర్ణభారత్ ట్రస్ట్‌కు వస్తారు. 9వ తేదీన గురువారం నెల్లూరు నగరంలో పలు శుభకార్యాలకు హాజరవుతారు. 10వ తేదీన స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తారు. 11వ తేదీన వెంకటాచలం నుంచి బయలుదేరి వెళ్తారు.

ముగిసిన ఇంటర్ ప్రాక్టికల్స్



నెల్లూరు(టౌన్): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు జరుగుతున్న ప్రాక్టికల్స్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. చివరిరోజు ఉదయం జనరల్‌కు సంబంధించి 375 మందికి గానూ 367 మంది హాజరయ్యారు. 8 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 17 మందికి గానూ 15 మంది హాజరయ్యారు. ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జనరల్‌కు సంబంధించి 256 మందికి గానూ 256 మంది హాజరయ్యారు. ఆర్ఐఓ రెండు, డీవీఈఓ రెండు, హై పవర్ కమిటీ సభ్యులు ఐదు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఐదు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

జెన్‌కో మూడో యూనిట్‌లో సీఓడీ ప్రారంభం



ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కో ప్రాజెక్టు 3వ యూనిట్ (800 మెగావాట్లు)కి సంబంధించి సీఓడీ (కమర్షియల్ ఆపరేషన్స్ డేట్) ప్రక్రియను సోమవారం సాయంత్రం ప్రారంభించారని సంబంధిత అధికారులు మంగళవారం వెల్లడించారు. ఈ యూనిట్‌ను గత అక్టోబర్ 27వ తేదీన సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జాతికి అంకితం చేసిన విషయం తెలిసిందే. ఈ యూనిట్‌లో అన్ని విభాగాలను క్షుణంగా పరిశీలించి, ట్రయల్ రన్ నిర్వహించి, లాంఛనంగా సీఓడీని ప్రారంభించారు. కాగా మూడో యూనిట్‌లో 803 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోందని అధికారులు వెల్లడించారు.


అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

• డ్వామా పీడీ వెంకట్రావు



నెల్లూరు(పొగతోట): ఉపాధి హామీ పథకం అమలులో సిబ్బంది అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ వెంకట్రావు హెచ్చరించారు. నెల్లూరులోని డ్వామా కార్యాలయం నుంచి వివిధ మండలాల ఏపీఓలు, ఈసీలు, టీఏలతో మంగళవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఉపాధి పనులు నిర్వహించాలన్నారు. పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలన్నారు. ఈ నెలాఖరులోపు నిర్దేశించిన లక్ష్యాలను వందశాతం మేర సాధించేలా చర్యలు చేపట్టాలన్నారు. పనుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఆధార్ అనుసంధాన ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలన్నారు.

59.359 టీఎంసీల నిల్వ



సోమశిల: జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 59.359 టీఎంసీల నీరు నిల్వ ఉన్నాయి. జలాశయం నుంచి పెన్నార్‌డెల్టాకు 2,100, ఉత్తరకాలువకు 623, దక్షిణ కాలువకు 400, కండలేరుకు 50 వంతున నీటిని విడుదల చేస్తున్నారు. సగటున 334 క్యూసెక్కుల నీరు ఆవిరవుతోంది.

వనితా.. వందనం

- ఎదుగుతూ.. దారి చూపుతూ..
- సేవా కార్యక్రమాల్లో ముందంజ
- పాలనలో కీలకపాత్ర
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ఆమె ఇంటికే పరిమితం కాలేదు. ఎన్నో రంగాల్లో తనదైన ముద్ర వేస్తోంది. ఉపాధ్యాయినిగా భావి భారత పౌరులను తయారు చేస్తోంది. వైద్యురాలిగా ఎన్నో ప్రాణాలను నిలబెడుతోంది. అంతరిక్ష పరిశోధనల్లో కీలకపాత్ర పోషిస్తోంది. వ్యాపార రంగంలో ఉన్నత శిఖరాలను చేరుకుంటోంది. స్వశక్తితో ఎదిగి పదిమందికి ఉపాధి కల్పిస్తోంది. క్రీడల్లో దూసుకుపోతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో కీలక బాధ్యతలతో ముందుకు సాగుతోంది. అందరి జీవితాల్లో వెలుగై నిలుస్తోంది. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనాలు.



మనసున్న 'సృజన'



సర్టిఫికెట్ అందజేస్తున్న సృజన



నెల్లూరు సిటీ: ఆమె పేరు సృజన. నెల్లూరు వాసి. 2013వ సంవత్సరం నుంచి బ్యూటీషియన్ వృత్తిలో ఉన్నారు. పేద మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు తనవంతుగా కృషి చేస్తున్నారు. 2015లో కేంద్ర ప్రభుత్వ స్కిల్ డెవలెప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా 400 మంది మహిళలకు బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ఇచ్చారు. 2018 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు తన సొంత ఖర్చుతో 55 మందికి శిక్షణ ఇచ్చారు. ఫిల్మ్ ఇండస్ట్రీలో, సీరియల్స్‌కు మేకప్ ఆర్టిస్ట్‌గా కూడా పనిచేశారు. సాధారణంగా హిజ్రాలపై చిన్నచూపు ఉంటుంది. వారు తమ కాళ్లపై తాము నిలబడి సమాజంలో గౌరవప్రదంగా జీవించేందుకు సృజన తోడ్పాటు అందించింది. ఇందులో భాగంగా కొంతకాలం క్రితం 14 మంది హిజ్రాలకు బ్యూటీషియన్ కోర్సులో ఉచితంగా శిక్షణ ఇచ్చారు.

దివ్యాంగుల జీవితాల్లో 'స్వర్ణదీపం'

ఆమె పేరు ఉమామహేశ్వరి. నెల్లూరు వాసి. పోలియో కారణంగా మూడేళ్ల వయసు నుంచి నడవలేని పరిస్థితి వచ్చింది. అయినా ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు పూర్తి చేశారు. ఫ్యాషన్ డిజైన్, ఇతర కోర్సుల్లో కూడా శిక్షణ తీసుకున్నారు. దివ్యాంగులకు తనవంతు సహకారం అందించాలని నిర్ణయించుకుని వేదాయపాళెంలో స్వర్ణదీపం చారిటబుల్ ట్రస్ట్‌ను 2008లో ప్రారంభించారు. ఏ ఆసరా లేని దివ్యాంగుల కోసం ఇల్లు అద్దెకు తీసుకుని వసతిగృహాన్ని ఏర్పాటు చేశారు. అందులో నేడు 40 మంది ఆశ్రయం పొందుతున్నారు. ఆమె భర్త రఫీకి కంటి చూపు తక్కువగా ఉంటుంది. అయినా ఇద్దరూ దాతల సహకారంతో దివ్యాంగులకు అన్ని వసతులు కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు. ఉమామహేశ్వరి ఇప్పటి వరకు సుమారు 500 మందికి వివిధ కోర్సుల్లో శిక్షణ ఇచ్చారు. సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.



భోజనం వడ్డిస్తున్న ఉమామహేశ్వరి

ప్రభుత్వ సహకారంతో..



పొదలకూరు: పట్టణంలోని నర్సారెడ్డికాలనీలో నివాసం ఉంటున్న ఎస్‌కే మాబున్నీ పెద్ద కుమార్తె డిగ్రీ, కొడుకు 8వ తరగతి చదువుతున్నారు. ఆమె కొంతకాలం క్రితం వరకు చేతులతో తినుబండారాలను తయారు చేసి విక్రయించారు. నేడు హైయర్ ఆర్డర్ ఎంటర్‌ప్రైజెస్‌ను స్థాపించి భర్తతో కలిసి కుటుంబాన్ని పోషిస్తున్నారు. పొదుపు సభ్యురాలైన మాబున్నీ ఇటీవలే ప్రభుత్వ సహకారంతో బ్యాంకు రుణం పొంది యూనిట్‌ను స్థాపించారు. దానిని ఇంట్లోనే గ్రౌండింగ్ చేసి బేకరీ ఐటమ్స్ తదితరాలను తయారు చేస్తున్నారు. వాటిని భర్త దుకాణాలకు వేస్తుంటాడు.

ఆమెకు అగ్రతాంబూలం

ఉమ్మడి జిల్లా పరిధిలో..	
ఎంపీటీసీ సభ్యులు :	322 మంది
ఎంపీపీలు :	31 మంది
జెడ్పీటీసీ సభ్యులు :	24 మంది
సర్పంచ్‌లు :	543 మంది
వార్డు సభ్యులు :	4,860 మంది
కౌన్సిలర్లు, కార్పొరేటర్లు :	85 మంది
జెడ్పీ చైర్‌పర్సన్ :	ఒకరు
పురపాలక అధ్యక్షులు :	ఐదుగురు



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళలకు అండగా నిలిచింది. అన్ని రంగాల్లో ఆమెకు అగ్రతాంబూలం వేసి పట్టం కట్టింది. గత స్థానిక సంస్థల ఎన్నికల నుంచి సచివాలయ, వలంటీర్ వ్యవస్థల్లో కూడా ఆమెకు 50 శాతం పైగా భాగస్వామ్యం చేసి మహిళా సాధికారితను సాకారం చేసింది. జిల్లాలో 19 లక్షలకు పైగా ఓటర్లు ఉంటే అందులో సుమారు 10 లక్షల వరకు మహిళలే ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వారి శ్రమ వెలకట్టలేనిది. వ్యవసాయ రంగంలో సుమారు 2 లక్షల మంది కార్మికులుగా పనిచేస్తుంటే అందులో 50 శాతం మహిళలే శ్రామికులుగా ఉన్నారు. జిల్లాలో భవన నిర్మాణ రంగంలోనూ పురుషులతో సమానంగా పనిచేస్తున్నారు. సుమారు 50 వేల మంది ఉన్నట్లు అంచనా. చిరు వ్యాపారులు, వర్తకులు, పరిశ్రమలలో పనిచేసే కార్మికులు ఇలా ప్రతి రంగంలో పురుషులకు ఏ మాత్రం తీసిపోని విధంగా మహిళలు పనిచేస్తున్నారు. సారా వ్యతిరేక ఉద్యమంలో జిల్లా కీర్తిని ప్రపంచానికి చాటింది.. మన జిల్లా మహిళలే.. పొదుపు ఉద్యమంలో దేశానికి ఆదర్శంగా నిలిచింది సింహపురి వనితలే. అనేక రంగాల్లో డాక్టర్లు, లాయర్లు, పోలీసు, జిల్లా ఉన్నతాధికారులుగా సత్తాను చాటుతున్నారు.

ఆర్థిక భరోసా

సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే అన్ని రంగాల్లో మహిళలకు ఎనలేని ప్రాధాన్యం ఇచ్చారు. వారికి సంక్షేమ, ఉపాధి, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అవకాశాలు కల్పించారు. మహిళా పాలనకు బీజం వేశారు. అమ్మఒడి, విద్యాదీవెన, ఇళ్ల నిర్మాణం తదితర పథకాలు వారికి అందించి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు. అలాగే గ్రామ స్వరాజ్యంలో భాగంగా జిల్లాలో 666 గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి అందులో 6,850 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించగా వారిలో సుమారు 3,800 మంది మహిళలున్నారు. అలాగే వలంటీర్ల వ్యవస్థలో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 9,500 మందికి ప్రాధాన్యం ఇచ్చి వారికి ఉపాధి కల్పిస్తున్నారు. దీంతోపాటు ఉమ్మడి నెల్లూరు జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు మహిళలకు కేటాయించడంతో సుమారు ఐదు వేల మందికి పైగా ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు నిర్వర్తిస్తునారు. అలాగే మున్సిపల్ చైర్‌పర్సన్లుగా, నగర మేయర్‌గా, జెడ్పీ చైర్‌పర్సన్‌గా వనితలే పనిచేస్తూ సత్తా చాటుతున్నారు. జిల్లాస్థాయిలో పలు శాఖల అధిపతులుగా పనిచేస్తూ ప్రజా మన్ననలు పొందుతున్నారు.

ఒకప్పుడు కూలీ.. నేడు యజమాని



చుట్టలు చుడుతున్న మహిళలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నెల్లూరులోని 54వ డివిజన్ జనార్దనరెడ్డి కాలనీకి చెందిన నసీమా.. ఈమె నేడు 12 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. సయ్యద్ అబ్దుల్ ఖాలిక్, నసీమా దంపతులకు ఎనిమిది మంది సంతానం. వారిలో ఐదుగురు ఆడపిల్లలు, ముగ్గురు మగపిల్లలున్నారు. ఖాలిక్ సంపాదనతో ఇల్లు గడవడం కష్టంగా మారింది. 15 సంవత్సరాల క్రితం నసీమా భర్తతోపాటు చుట్టలు చుట్టే పనికి వెళ్లి కుటుంబానికి ఆసరాగా నిలిచారు. ఆమె పొదుపు గ్రూపులో ఉన్నారు. వచ్చిన రుణాలతో పిల్లలకు చదువులు చెప్పించారు. ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడికి వివాహాలయ్యాయి. నసీమాకు నాలుగు సంవత్సరాల క్రితం వచ్చిన రుణంతో ధైర్యం చేసి చుట్టల తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఒకప్పుడు రోజుకు రూ.200 కూలికి వెళ్లిన ఆమె నేడు 12 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి అసంపూర్తిగా మిగిలిపోయిన ఇంటి పనులను పూర్తి చేయించి కుటుంబానికి అండగా నిలిచారు.

ఆసరాగా ఉన్నా



నా భర్త రిక్షా కార్మికుడు. నేటి పరిస్థితుల్లో రిక్షా తొక్కితే ఎంత వస్తుందో అందరికీ తెలిసిందే. అందుకే కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు నసీమా చుట్టల తయారీ కంపెనీ తయారీ కేంద్రంలో పనిచేస్తున్నా. రోజుకు ఎంత పనిచేస్తే అంత కూలి వస్తుంది. రూ.300 నుంచి రూ.500 వరకు సంపాదించే వీలుంది.

– ఎస్‌కే షాహినా, చుట్టల తయారీ కేంద్రంలో కార్మికురాలు

ఉన్నత చదువులు అభ్యసించాలి



ప్రతి మహిళ ఉన్నత చదువులు చదవాలి. అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారు. సమస్యలను ధైర్యంగా ఎదుర్కోగలరు. సమస్యలను ఎలా పరిష్కరించుకోగలమో తెలుస్తుంది. ప్రభుత్వ పరంగా ఎలా సహకారాన్ని పొందవచ్చు.. ఎలా చట్టపరంగా ముందుకు పోవచ్చో తెలుస్తుంది.

– వెంకటనారాయణమ్మ, డీఆర్వో

ధైర్యంగా ముందడుగు వేస్తే..



నాకు ఎంబీబీఎస్ చదవాలన్న ఆసక్తి లేదు. నాన్న మెడికల్ కళాశాలలో చేర్పించాడు. అయితే ఎంబీబీఎస్ మూడో సంవత్సరంలోనే వివాహం చేశారు. నా భర్త కూడా డాక్టర్. ఆయన ప్రోత్సాహం అందించారు. దీంతో పీజీ కూడా చేశాను. ఆడవాళ్లు ధైర్యంగా ముందుకు అడుగేస్తే రాణిస్తారనేందుకు నేనే ఉదాహరణ. ప్రస్తుత సమాజంలోని మహిళలు ఎంతోమందికి ప్రేరణ కల్పిస్తున్నా.

– డాక్టర్ కళారాణి, ఆర్ఎంఓ, జీజీహెచ్

ప్రజాస్వామ్య వ్యవస్థలపై అవగాహన పెంచుకోవాలి

• కలెక్టర్ చక్రధర్‌బాబు

నెల్లూరు(బృందావనం): ప్రజాస్వామ్య వ్యవస్థలపై యువత అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు పిలుపునిచ్చారు. నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం నెల్లూరులోని పురమందిరంలో మాక్ యూత్ పార్లమెంట్ నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. పార్లమెంట్ వ్యవస్థ ఎంతో కీలకమైందన్నారు. దీనిపై యువతకు సంపూర్ణ అవగాహన కలిగించే లక్ష్యంతో 'మాక్ యూత్ పార్లమెంట్'' కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పార్లమెంట్‌లో జరుగుతున్న విధానపరమైన అంశాలను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని సూచించారు. సామాజిక అంశాలపై అవగాహన కలిగి దేశం గర్వించదగిన విధంగా యువత మారాలని ఆకాంక్షించారు. తొలుత కలెక్టర్ స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ మహేంద్రరెడ్డి, సెట్నెల్ సీఈఓ పుల్లయ్య, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

డీడీ సరెండర్

నెల్లూరు(వేదాయపాళెం): జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారిణి రమాదేవిని ఆ శాఖకు సరెండర్ చేస్తూ కలెక్టర్ చక్రధర్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం, ఉద్యోగుల పదోన్నతుల్లో అవినీతి ఆరోపణలు రావడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించి, నివేదిక ఆధారంగా శాఖా పరమైన చర్యలు తీసుకున్నారు. కాగా ఇన్‌చార్జి డీడీగా బీసీ సంక్షేమం, సాధికారత అధికారి వై.వెంకటయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

రేపటి నుంచి 'పది' ప్రీ పబ్లిక్ పరీక్షలు

• మిగిలిన తరగతులకు ఫార్మేటివ్–4 పరీక్షలు

నెల్లూరు(టౌన్): జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈనెల 9 నుంచి 20వ తేదీ వరకు ప్రీ పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇవి మధ్యాహ్నం 1.30 నుంచి 4.45 గంటల వరకు జరుగుతాయి. అదేవిధంగా ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఫార్మేటివ్-4 పరీక్షలను నిర్వహించనున్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వారికి ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 3.00 వరకు, ఆరు నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1.30 నుంచి 2.15 వరకు, 3 నుంచి 3.45 వరకు, 9వ తరగతి విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి 10.15 గంటల వరకు, మధ్యాహ్నం 11 నుంచి 11.45 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఎస్‌సీఈఆర్టీ ఆన్‌లైన్‌లో ఏ రోజుకారోజు ప్రశ్నపత్రాలను పంపిస్తుంది. వాటిని జిల్లాలోని అన్ని పాఠశాలల వాట్సప్ గ్రూపుల ద్వారా షేర్ చేస్తారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అవసరమైన ప్రశ్నపత్రాలను ప్రింట్ తీయడం లేదా, డిక్టేట్ చేస్తూ పరీక్షలను నిర్వహించాలి. ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు 20 మార్కులకు, పదో తరగతి విద్యార్థులకు వంద మార్కులకు పరీక్షలు జరుగుతాయి.

గెలిపిద్దాం.. సీఎంకు కానుకగా ఇద్దాం



గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతం కావడంతో కేక్ కట్ చేస్తున్న కాకాణి, వేమిరెడ్డి, బాలినేని, చిత్రంలో ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు

- ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రతిష్టాత్మకం
- గెలిచి జిల్లా వైఎస్సార్‌సీపీ కంచుకోటని నిరూపిద్దాం
- ముఖ్యనేతల సమావేశంలో కాకాణి, బాలినేని, వేమిరెడ్డి

నెల్లూరు(సెంట్రల్): 'గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు మనకు ఎంతో ప్రతిష్టాత్మకం. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇద్దాం.' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి , రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులతో మంగళవారం సమావేశం జరిగింది. ఆ పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి, నెల్లూరు ఎంపీ, పార్టీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి, తిరుపతి ఎంపీ ఎం.గురుమూర్తి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యేలు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, డాక్టర్ పి.అనిల్‌కుమార్, కిలివేటి సంజీవయ్య, పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు బల్లి కళ్యాణ్ చక్రవర్తి, తూమాటి మాధవరావు, నాయకులు కొండ్రెడ్డి రంగారెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు.

• కాకాణి మాట్లాడుతూ స్థానిక సంస్థలకు సంబంధించి మేరిగ మురళీధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. అందరం సమష్టిగా కృషి చేసి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని గెలిపించుకుందామన్నారు. సీఎం పిలుపుతో ప్రముఖ పారిశ్రామికవేత్తలు విశాఖ సమ్మిట్‌కు విచ్చేసి పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపారన్నారు. అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని, అందుకే ఓటడిగేందుకు ధైర్యంగా ప్రజల్లోకి వెళ్తున్నామన్నారు. ప్రతిపక్షం చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మడం లేదన్నారు.



హాజరైన నాయకులు తదితరులు

• బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుందామన్నారు. అభ్యర్థులిద్దరూ జిల్లాలో అందరికీ తెలిసిన వ్యక్తులే అన్నారు. మొదటిసారిగా ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీలో దిగామని, తప్పకుండా పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

• వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ 2024 ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎమ్మెల్సీ ఎన్నికలను అందరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. కష్టపడి పనిచేసి అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతమైందని, ఈ ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వ్యాపార దిగ్గజాలు సీఎం పనితీరును ఎంతగానో మెచ్చుకున్నారన్నారని గుర్తుచేశారు.

• ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ అణగారిన వర్గాలకు రాజకీయంగా గుర్తింపు ఇచ్చిన గొప్ప వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. క్షేత్రస్థాయిలో బాగా పనిచేసి ఇద్దరు ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకుందామన్నారు.

• బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ సామాజిక న్యాయాన్ని చేతల్లో చూపించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుంన్నారు.

• రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి అందరూ కష్టపడి పనిచేయాలన్నారు.

• మేరిగ మురళీధర్ మాట్లాడుతూ తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన సీఎంకు రుణపడి ఉంటానన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తానన్నారు.

• పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తనకు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని కోరారు.

• పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ఎన్నికల్లో తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

• గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతం కావడంతో వేమిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

- కనులపండువగా ప్రసన్నుని కల్యాణోత్సవం
- గోవింద నామస్మరణతో మార్మోగిన కొండబిట్రగుంట
- కల్యాణాన్ని వీక్షించిన భక్తజనం
- రథోత్సవంలో అపశ్రుతి

ఇల వైకుంఠం.. బిలకూటక్షేత్రం



కనులపండువగా జరుగుతున్న ప్రసన్నవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



వేడుకగా సాగుతున్న రథోత్సవం

బిట్రగుంట: కొండబిట్రగుంటలోని బిలకూట క్షేత్రం మంగళవారం ప్రసన్నవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం సందర్భంగా ఇల వైకుంఠం వలె కనిపించింది. ప్రసన్నవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో కీలకఘట్టమైన కల్యాణోత్సవాన్ని వేద పండితులు అత్యంత వైభవంగా నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తుల గోవింద నామస్మరణ, వేదపండితుల దివ్యమంత్రోచ్ఛారణలు, మేళతాళాల నడుమ ప్రసన్నుని కల్యాణం కనులపండువగా జరిగింది. వేకువనే పాతబిట్రగుంట, కొండబిట్రగుంట వీధుల్లో గజవాహనంపై పెండ్లికుమారుడిగా విహరించిన స్వామివారు ఉదయం శుభముహూర్తంలో కల్యాణ వేదిక వద్దకు చేరుకున్నారు. ప్రత్యేకంగా తెప్పించిన పుష్పాలు, తులసిమాలలతో శోభాయమానంగా అలంకరించిన కల్యాణ వేదికపై శ్రీదేవి భూదేవి సమేతంగా స్వామివారు కొలువుదీరారు. అదే సమయంలో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి – ఆదిలక్ష్మి దంపతులు, వారి కుమారుడు కోడలు సాకేత్‌రెడ్డి – మహిమారెడ్డి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, కల్యాణ ద్రవ్యాలను తీసుకువచ్చారు. అలాగే కల్యాణోత్సవం ఉభయకర్తలు కూడా పట్టువస్త్రాలు, కల్యాణ ద్రవ్యాలతో వేదిక వద్దకు చేరుకున్నారు. వేదికపై స్వామివారు సర్వాలంకార భూషితులైన అనంతరం వేదపండితులు అగ్నిహోత్రం వంశీకృష్ణమాచార్యులు, ఆలయ ప్రధానార్చకులు వేదగిరి కల్యాణచక్రవర్తి ఆచార్యుల ఆధ్వర్యంలో అర్చక బృందం వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవాన్ని ప్రారంభించారు. తొలుత విశ్వక్సేనపూజ, యజ్ఞోపవీత ధారణ, కంకణధారణ, పుణ్యాహవచనం, అనంతరం మధుపర్కం, దృశ్య, స్పర్శ, శ్రవణ వంటి షోడశోపచార పూజలను శాస్త్రోక్తంగా జరిపి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తుల గోవింద నామస్మరణలతో బిలకూటక్షేత్రం మార్మోగిపోయింది. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ మాంగల్యధారణ నేత్రపర్వంగా సాగింది. భక్తులు ప్రసన్నుని కల్యాణాన్ని భక్తిపారవశ్యంతో వీక్షించి తరించారు. కల్యాణోత్సవానికి వింజం వెంకటసుబ్బమ్మ మనుమలు, మనుమరాళ్లు కొల్లపనేని వెంకటేశ్వర్లు, ధనలక్ష్మి, ఒట్టిగుంట శ్రీనివాసులు, రాములమ్మ దంపతులు ఉభయాన్ని సమర్పించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

రథోత్సవంలో అపశ్రుతి

ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన రథోత్సవంలో అపశ్రుతి చోటుచేసుకుంది. రథోత్సవం పాతబిట్రగుంట నుంచి తిరిగి కొండబిట్రగుంటకు వస్తున్న క్రమంలో మలుపు వద్ద అదుపుతప్పడంతో రథం నేల వాలింది. స్థానికులు, భక్తుల కథనం మేరకు పాతబిట్రగుంటలో ఊరేగింపు పూర్తయిన తర్వాత రాత్రి 9 గంటల సమయంలో తిరిగి కొండబిట్రగుంట పొలిమేరల్లోకి వచ్చేసరికి రోడ్డు మలుపులో రథం అదుపుతప్పింది. రథం కుడివైపున ఉన్న ముందు చక్రం రోడ్డు పక్కనే ఉన్న కాలువలోకి దిగడంతో రథం అదుపుతప్పి నేలకు వాలింది. రథంలోని అర్చకులతోపాటు రథం చుట్టూ ఉన్న భక్తులకు కూడా అదృష్టవశాత్తు చిన్నపాటి గాయాలు కూడా కాకుండా ప్రమాదం నుంచి బయటపడ్డారు. రథాన్ని పైకి లేపేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.



కొండబిట్రగుంట సమీపంలో నేల వాలిన ప్రసన్నుని రథం

మాతాశిశు మరణాల నివారణకు చర్యలు

- కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు

నెల్లూరు(వేదాయపాళెం): జిల్లాలో మాతాశిశు మరణాలు నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మాతాశిశు మరణాల నివారణపై జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో జరిగిన మాతాశిశు మరణాలకు సంబంధించి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భిణులకు సంబంధించి మెరుగైన వైద్యసేవలు అందించాలని, నిరంతరం వారి ఆరోగ్య స్థితిగతులను పరిశీలించి సకాలంలో మందులు అందజేయాలని సూచించారు. హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి వారికి పూర్తిస్థాయి అవగాహన కల్పించి సురక్షితమైన ప్రసవం జరిగేలా వైద్యాధికారులు దృష్టి సారించాలన్నారు. ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు సమన్వయంతో పనిచేసి మాతాశిశు మరణాలను తగ్గించాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి పెంచలయ్య, డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్, ఐసీడీఎస్ పీడీ సౌజన్య, భూలోకమ్మ, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.



వైద్యాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

క్లుప్తంగా

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ముత్తుకూరు: మండలంలోని వల్లూరు చెరువులో సోమవారం సాయంత్రం గల్లంతైన కన్నపు జగదీష్ మృతదేహాన్ని మంగళవారం ఉదయం వెలికితీశారు. స్థానిక శివాలయం వద్ద ఖర్జూరం విక్రయించేందుకు వచ్చిన జగదీష్ వల్లూరు చెరువులో దిగి గల్లంతైన విషయం తెలిసిందే. పోలీసులు గజ ఈతగాళ్లను రప్పించగా, వారు పడవ సాయంతో చెరువులో గాలించి జగదీష్ మృతదేహాన్ని గుర్తించి బయటకు తీసుకువచ్చారు. కొడుకు జగదీష్ మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.



జగదీష్ మృతదేహం

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ముత్తుకూరు: మండలంలోని వల్లూరు గ్రామంలో ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన పాసం సుబ్బారావు – సునీత దంపతులు గ్రామంలో అద్దె ఇంట్లో ఉంటూ సిల్వర్ పాత్రల వ్యాపారం సాగిస్తున్నారు. తల్లిదండ్రులు ఊరికి వెళ్లిన సమయంలో కొడుకైన పాసం వెంకటేశ్వర్లు(21) సోమవారం రాత్రి ఫ్యానుకు ఉరేసుకుని మృతిచెందాడు. మంగళవారం మధ్యాహ్నం భోజనం పెట్టేందుకు బంధువులు వచ్చి చూడగా వెంకటేశ్వర్లు ఫ్యానుకు వేలాడుతూ కనిపించాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ గురుకులం ఏర్పాటుకు చర్యలు

- జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య

పొదలకూరు: సర్వేపల్లి నియోజకవర్గంలోని పొదలకూరులో బీసీ బాలుర గురుకుల పాఠశాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ, ఇన్‌చార్జి సాంఘిక సంక్షేమ అధికారి వై.వెంకటయ్య తెలిపారు. గురుకుల పాఠశాల ఏర్పాటుకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం పాత ఐటీఐ కళాశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్లుగా ఈ ప్రాంతంలో గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసేందుకు వసతి భవనాలను అన్వేషిస్తున్నట్లు తెలిపారు. పొదలకూరులో ఐటీఐ కళాశాలకు నూతన భవన సముదాయం నిర్మించడం వల్ల పాత భవనం ఖాళీ అయిందని, గురుకుల పాఠశాలను పాత ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసేందుకు పరిశీలిస్తున్నట్లు తెలిపారు.



పాత ఐటీఐ కళాశాలను పరిశీలిస్తున్న జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య

జగనన్న విద్యాదీవెన వెరిఫికేషన్

పట్టణంలోని ఎస్పీబీవీడీ డిగ్రీ కాలేజీలో జగనన్న విద్యాదీవెన జాబితాను బీసీ సంక్షేమ, ఇన్‌చార్జి సాంఘిక సంక్షేమ అధికారి వెంకటయ్య వెరిఫికేషన్ చేశారు. ప్రతి కళాశాల యాజమాన్యం జేవీడీ జాబితాను పెండింగ్ లేకుండా చూసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏఎస్‌డబ్ల్యూఓ డి.నరసింహారెడ్డి, జిల్లా బీసీ రెసిడెన్షియల్ స్కూల్స్ కన్వీనర్ కొండలరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్‌కే అల్లాభక్షు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు సీహెచ్ విద్యుల్లత, జె.మాధవరావు ఉన్నారు.

సరళతరంగా రుణాలు అందజేస్తున్నాం

- ఎన్‌డీసీసీబీ సీఈఓ శంకర్‌బాబు

ఆత్మకూరు: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ద్వారా, సొసైటీల్లో సులభతరంగా రుణాలు అందజేస్తున్నామని, ముఖ్యంగా రైతులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని సీఈఓ సి.శంకర్‌బాబు తెలిపారు. పట్టణంలోని ఎన్‌డీసీసీబీ శాఖలో మంగళవారం డివిజన్ పరిధిలోని అన్ని శాఖలు, సొసైటీల అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2022–23 వార్షిక సంవత్సరానికి సంబంధించి రూ.528 కోట్ల డిపాజిట్లు సేకరించాలని లక్ష్యం ఉండగా, రూ.420 కోట్లు డిపాజిట్లు చేసినట్లు తెలిపారు. డిపాజిట్లపై జాతీయ బ్యాంకుల కన్నా ఎక్కువగా 7.5 శాతం వడ్డీ చెల్లిస్తుండగా, సీనియర్ సిటిజన్లకు 8 నుంచి 8.25 శాతం వడ్డీ చెల్లిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో రైతులతోపాటు పలువురికి రూ.580 కోట్ల రుణాలు పంపిణీ చేశామన్నారు. పొదుపు గ్రూపులకు విరివిగా రుణాలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. బంగారు నగలపై రుణాలతోపాటు గృహ నిర్మాణానికి, భూముల అభివృద్ధికి, పంట రుణాలు అందజేస్తున్నామన్నారు. మరో 13 శాఖల ఏర్పాటుకు, అలాగే మరో 9 ఏటీఎంలు, రెండు మొబైల్ ఏటీఎంల ఏర్పాటుకు రిజర్వు బ్యాంక్ అనుమతులు కోరామని తెలిపారు. కార్యక్రమంలో ఆప్కాబ్ జీఎం ఆర్.శ్రీనివాసరావు, ఏజీఎం ఎస్‌కే అహ్మద్‌బాషా, ఆత్మకూరు బ్రాంచ్ మేనేజర్ సీహెచ్ శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ జనార్దన్‌రెడ్డి, ఆత్మకూరు, వింజమూరు, ఉదయగిరి, బుచ్చిరెడ్డిపాళెం తదితర శాఖల మేనేజర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్‌డీసీసీబీ సీఈఓ శంకర్‌బాబు

హత్య కేసుల్లో ఇద్దరికి జైలు

నెల్లూరు(లీగల్): రెండు హత్య కేసుల్లో నేరం రుజువు కావడంతో ఆయా కేసుల్లో హత్యకు పాల్పడిన ఇద్దరు నిందితులకు మంగళవారం కోర్టు శిక్ష, జరిమానా విధించింది.

ఏడేళ్ల జైలు, జరిమానా

ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసి హత్య చేసినట్లు నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో నెల్లూరులోని కుక్కలగుంట విఘ్నేశ్వరాపురం ప్రాంతానికి చెందిన చిడుగు దయానంద్‌కు ఏడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.200 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వాలాజీ సాయి అనే వ్యక్తి నెల్లూరు మార్కెట్‌లోని కూరగాయల దుకాణంలో పనిచేస్తుండేవాడు. కోటమిట్టలోని వీబీ ఎస్ కల్యాణ మండపం ప్రాంతంలో భార్యతో కలిసి నివాసం ఉండేవాడు. ఈ క్రమంలో 2020 అక్టోబర్ 25న ఉదయం 10 గంటల సమయంలో సాయి, అనిల్, సుబ్బారావు ముగ్గురూ కుక్కలగుంట వద్ద ఉండగా, అదే ప్రాంతానికి చెందిన దయానంద్ అక్కడికి వచ్చి అనిల్‌తో గొడవపడ్డాడు. దీంతో సాయి, సుబ్బారావు సర్దిచెప్పారు. అనంతరం దయానంద్ వారిపై కోపగించుకుని గంటలో వచ్చి మీ అంతుచూస్తానంటూ బెదిరించి వెళ్లిపోయాడు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో స్థానిక ఆటోస్టాండ్ వద్ద నిలుచుకుని ఉన్న సాయిని మద్యం మత్తులో వచ్చిన దయానంద్ కత్తితో విచక్షణారహితంగా పొడిచి గాయపరిచాడు. చుట్టుపక్కల వారు అక్కడికి రావడంతో కత్తిని పడవేసి పరారయ్యాడు. గాయపడిన సాయిని స్థానికులు నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. సాయి తల్లి విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం దయానంద్‌పై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో పై మేరకు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ విజయమ్మ కేసు వాదించారు.

మరో నిందితుడికి..

లావుపాటి కర్రతో ఓ వ్యక్తి తలపై దాడి చేసి హత్యకు పాల్పడ్డాడని నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో ఉత్తరప్రదేశ్ అమర్‌పూర్ జిల్లా, గ్రాహవేలి గ్రామానికి చెందిన హరిబల్వీర్‌కు ఏడేళ్ల జైలుశిక్షతోపాటు రూ.200 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు గ్రాహవేలి గ్రామానికి చెందిన రజ్జన్, నిందితుడు హరిబల్వీర్, మరికొంతమంది బుచ్చిరెడ్డిపాళెం మండలం రేబాల పంచాయతీ పరిధిలోని హైవే వద్ద ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివాసం ఉన్నారు. బేల్దారి పనులు చేసుకుంటూ ఉండేవారు. 2018 అక్టోబర్ ఒకటో తేదీ మధ్యాహ్నం 1.30 సమయంలో హరిబల్వీర్‌తో రజ్జన్ 'మీ తండ్రి నా వద్ద నగదు తీసుకుని ఇవ్వకుండా ఎగవేశాడని.. అందుకే ఆయన క్యాన్సర్‌తో మృతిచెందాడని.. నీకు కూడా అదేగతి పడుతుందంటూ' దూషించాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య వాదోపవాదాలు జరిగాయి. దానిని మనస్సులో పెట్టుకున్న హరిబల్వీర్ అదేరోజు రాత్రి ఒంటిగంట సమయంలో నిద్రిస్తున్న రజ్జన్‌పై లావుపాటి కర్రతో దాడి చేసి హత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని మిద్దెపై నుంచి కింద పడవేసి అనంతరం దగ్గరలోని బావిలో వేశాడు. ఈ ఘటనపై అద్దెకు ఉంటున్న వారిలోని ప్రసాద్ అనే యువకుడు ఫిర్యాదు చేయడంతో బుచ్చిరెడ్డిపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం హరి బల్వీర్‌పై చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో పై మేరకు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ విజయమ్మ కేసు వాదించారు.

పారిశ్రామికవేత్తలు క్యూ కడుతున్నారు

కందుకూరు: ఆంధ్రప్రదేశ్‌కు పారిశ్రామికవేత్తలు క్యూ కడుతున్నారని ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలోని పారిశ్రామిక దిగ్గజాలు, ప్రపంచంలోని ప్రముఖ కంపెనీల అధిపతులు స్వయంగా విశాఖపట్నంలో జరిగిన 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్'కు వచ్చి రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులపై ఒప్పందాలు చేసుకున్నారని తెలిపారు. రామాయపట్నం పోర్టు పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి పి.చంద్రశేఖర్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 103
లేయర్ (లైవ్)	: 75
బ్రాయిలర్ చికెన్	: 184
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 206
లేయర్ చికెన్	: 128



పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.90
సన్నవి	: రూ.75
పండ్లు	: రూ.45

